సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 20 । నవంబర్ । 2023



సురక్షలో సిఫారసు.. శస్త్రచికిత్సలు
జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో సిఫారసు చేసిన రోగులకు ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. వేగంగా ఆపరేషన్లు చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. 8లో



సువర్చలా హనుమద్ కల్యాణం
మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని వీక్షించారు. 8లో



అనుమానాస్పద స్థితిలో మృతి
అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో జరిగింది. మృతుని వివరాలు ఇంకా తెలియరాలేదు. 8లో

న్యూస్‌రీల్

బీచ్‌లో సందర్శకుల సందడి



పేరుపాలెం బీచ్‌లో సందర్శకుల సందడి

నరసాపురం రూరల్: కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌ల్లో ఆదివారం సందర్శకుల సందడి మొదలైంది. కార్తీక మాసం మొదటి ఆదివారం కావడంతో బీచ్‌కు వేలాదిగా పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బీచ్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్సైలు, పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. తీరం నుంచి 100 మీటర్ల దూరంలో సముద్రంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు ఏర్పాటు చేశారు. బారికేడ్లు దాటి వెళ్లేందుకు సాహసం చేసిన యువకులను గజ ఈతగాళ్లు వెనక్కి పంపారు. మద్యం తాగి స్నానానికి వచ్చిన పలువురిని గుర్తించి కంట్రోల్ రూంకు తీసుకువచ్చి కూర్చోపెట్టారు. సందర్శకులు సముద్రంలో స్నానం చేసి తీరంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామిని, వేళాంకిని మాతను, 54 అడుగుల అభయాంజనేయస్వామిని, మత్స్యనారాయణస్వామిని, సాయిబాబా ఆలయాలను దర్శించుకున్నారు.

నేడు వాక్ విత్ అంబటి

సత్రంపాడు నుంచి రన్



రన్‌కు క్రికెటర్ అంబటి రాయుడును ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఈ నెల 20 న దెందులూరు నియోజకవర్గానికి ఇంటర్నేషనల్ క్రికెటర్ అంబటి రాయుడు వస్తున్నట్లు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 20న దెందులూరు నియోజకవర్గం సత్రంపాడు నుంచి వట్లూరు వరకు రన్ నిర్వహిస్తున్నామన్నారు. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. అనంతరం సీఆర్‌ఆర్ కళాశాలలో జరిగే క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే, క్రికెటర్ అంబటి రాయుడు ప్రారంభిస్తారు.

ఫుట్‌బాల్‌లో పశ్చిమ జయకేతనం



విజేతగా నిలిచిన భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కాలేజీ జట్టు

పెనమలూరు: జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజీ ఫుట్‌బాల్ పోటీల్లో భీమవరానికి చెందిన విష్ణు ఇంజనీరింగ్ కాలేజీ జట్టు విజయం సాధించింది. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో జేఎన్‌టీయూకే పరిధిలో ఉన్న 16 కాలేజీలు పోటీల్లో పాల్గొన్నాయి. విష్ణు ఇంజనీరింగ్ జట్టు విజయం సాధించి కప్పు కైవసం చేసుకుంది. రెండో స్థానంలో రాజమండ్రికి చెందిన గోదావరి ఇంజనీరింగ్ కాలేజీ, మూడో స్థానంలో కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ, కాకినాడ ఆదిత్య కాలేజీ సంయుక్తగా గెలిచాయి. ఏపీ షటిల్ బ్యాడ్మింటన్ కార్యదర్శి డాక్టర్ పి.అంకమ్మచౌదరి గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, టోర్నమెంట్ కార్యదర్శి జేపీ రాజు, డీన్ బావినేని పాండురంగారావు, కాలేజీ పీడీ పి.రఘు, వివిధ కాలేజీల పీడీలు, కోచ్‌లు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టైలర్స్‌కు పూర్వ వైభవం వచ్చేలా కృషి

కొయ్యలగూడెం: టైలర్లకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర టైలర్స్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ సుభాన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో నిర్వహించిన టైలర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రెడీమేడ్ రంగం టైలర్ల బతుకులను చిదిమివేసిందని, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని సుమారు 10 లక్షల మంది టైలర్ల బతుకులకు భరోసా కల్పిస్తూ ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం చేస్తున్నారన్నారు. టైలర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఆయన చెప్పారు.

కులగణనకు సన్నద్ధం

- వందేళ్ల తర్వాత ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం
- ఈ నెల 27 నుంచి సర్వే ప్రారంభం
- సన్నాహాల్లో నిమగ్నమైన జిల్లా యంత్రాంగం
- డిసెంబరు 10 వరకు డోర్ టూ డోర్ సర్వే



సాక్షి, భీమవరం: సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. వందేళ్ల క్రితం జరిగిన కులగణనను తిరిగి నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ నెల 27 నుంచి డిసెంబరు 10 వరకు జరిగే డోర్ టూ డోర్ సర్వేకు జిల్లా యంత్రాంగం సన్నాహాల్లో నిమగ్నమైంది. బ్రిటీష్ హయాంలో 1872లో తొలిసారిగా కులగణన చేసినట్టు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుంది. 1921 సంవత్సరం వరకు పదేళ్లకు ఒకసారి ఈ ప్రక్రియ కొనసాగుతూ వచ్చినట్టు సమాచారం. తర్వాతి నుంచి జనగణన చేస్తున్నప్పటికీ కులగణన నిలిచిపోయింది. వివిధ కుల సంఘాల నుంచి కులగణన చేయాలన్న డిమాండ్ దీర్ఘకాలంగా ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దీంతో రిజర్వేషన్లు, ప్రభుత్వ పథకాల అమలులో ఎన్నో వందల ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్న విమర్శలున్నాయి. వారి కలను నెరవేరుస్తూ తిరిగి కులగణన చేసేందుకు సీఎం జగన్ నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన మార్గదర్శకాల మేరకు సర్వే నిర్వహణకు ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి కులగణన చేయనున్నారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌ఓలు, మండల ప్రత్యేకాధికారులు సర్వేను పర్యవేక్షిస్తారు. జిల్లాలో 18,44,898 మంది జనాభా ఉండగా పురుషులు 9,21,771 మంది, మహిళలు 9,23,127 మంది ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ జనాభా 3,30,129 మంది, ఎస్టీ జనాభా 18,663 మంది. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాల్లో ఎంత మంది ఏ ఏ ఉపకులాల జనాభా ఉన్నారు, వారి స్థితిగతులు తెలుసుకునేందుకు కులగణన దోహదం చేస్తుందని అధికారులు అంటున్నారు. విధాన నిర్ణయాలు రూపొందించేందుకు, అట్టడుగు వర్గాల వారికి సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో అందించేందుకు వీలుంటుందంటున్నారు. సర్వే నిర్వహణకు ఇప్పటికే వివిధ స్థాయిల్లో జిల్లా అధికార యంత్రాంగం శిక్షణ నిర్వహిస్తోంది. గ్రామ, వార్డు స్థాయిలో సమావేశాలు, టాంటాం, మైక్ అనౌన్స్‌మెంట్ తదితర వాటి ద్వారా సర్వే ఆవశ్యకత, ప్రయోజనాలను విస్తృతంగా ప్రజలకు వివరించే ఏర్పాట్లు చేస్తున్నారు.

పేదలకు ఎంతో మేలు



ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన జీవనోపాధి, జనాభా సమతుల్యత, అంశాలపై ఈ నెల 27 నుంచి డిసెంబర్ 10 వరకు జిల్లాలో కులగణన జరగనుంది. ప్రభుత్వ విధాన నిర్ణయాలు రూపొందించేందుకు, సంక్షేమ పథకాల అమలుకు సర్వే వివరాలు దోహదపడతాయి. బలహీన, వెనుకబడిన వర్గాల వారికి మరింత మేలు చేసేందుకు వీలు కలుగుతుంది.

– పి.ప్రశాంతి, కలెక్టర్

సర్వేకు మార్గదర్శకాలు

- సర్వేలో కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలనే నమోదు చేయాలి. వాటికి సంబంధించిన ధ్రువీకరణ ప్రతాలు అవసరం లేదు.
- కులాంతర వివాహాలు చేసుకున్నవారికి, ఎవరి కులం వారికే నమోదు చేయాలి.
- ఇది స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న సర్వే. ఎవరైనా కులం పేరు చెప్పడానికి ఇష్టపడకపోతే, వారిని బలవంతం చేయాల్సిన అవసరం లేదు.
- సేకరించిన సమాచారం ప్రభుత్వం వద్ద భద్రంగా ఉంటుంది. దీనిని ఏ ప్రైవేటు సంస్థకు, వ్యక్తులకు వెల్లడించరు.

5. వివరాలు నమోదుచేసినప్పుడు ఈకేవైసీ తప్పనిసరిగా తీసుకోవాలి. ఎనిమిది ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారికి ఈకేవైసీ తప్పనిసరి కాదు.

- సర్వే పూర్తిచేసిన తర్వాత సచివాలయం సిబ్బంది, వలంటీర్ బయోమెట్రిక్ వేసి వివరాలను సబ్మిట్ చేయాలి.

ఏఏ వివరాలు సేకరిస్తారు

- కుటుంబం అందుబాటులో ఉన్నారా/మరణించారా/ శాశ్వతంగా వలస వెళ్లారా.
- జిల్లా, జిల్లా కోడ్, మండలం/ మున్సిపాలిటీ, గ్రామం, పంచాయతీ, పంచాయతీ కోడ్, వార్డు నెంబర్, ఇంటి నెంబర్ సేకరిస్తారు.
- కుటుంబ పెద్ద పేరు, ఆధార్ నెంబర్, కుటుంబ సభ్యుల సంఖ్య, కుటుంబ సభ్యుడి పేరు, కుటుంబ పెద్దతో సంబంధం, రేషన్ కార్డు నెంబర్
- కుటుంబం ఉంటున్న ఇల్లు (కచ్చా, స్లాబ్, డ్యుప్లెక్స్, భవనం)
- ప్రస్తుత చిరునామా
- మరుగుదొడ్డి సౌకర్యం ఉందా లేదా?
- మంచి నీరు/తాగునీటి సదుపాయం ఉందా? (వీధి కుళాయి, బోర్‌వెల్, పబ్లిక్ బోర్ వెల్, సొంత కుళాయి)
- పశు సంపద ఏమైనా ఉందా?
- వంట సాధనం (ఎల్పీజీ గ్యాస్, కిరోసిన్, కట్టెలు)

కుటుంబసభ్యుల వివరాలు

- కుటుంబ సభ్యుడి పేరు, తండ్రి పేరు, జెండర్, పుట్టిన తేదీ, వైవాహిక స్థితి, కులం, ఉప కులం, మతం, విద్యార్హత, ప్రస్తుతం చేస్తున్న వృత్తి
- వ్యవసాయ భూమి, నివాస స్థలం వివరాలు

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయికి స్వామి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అకుల వెంకట శేషసాయి ఆదివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

యల్లారమ్మ సన్నిధిలో..

తణుకు టౌన్: తణుకు మండలం మండపాకలో శ్రీ యల్లారమ్మని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అకుల వెంకట శేషసాయి దంపతులు, ఏలూరు జిల్లా జడ్జి సీహెచ్ పురుషోత్తం దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆలయ మర్యాదల చొప్పున పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయమూర్తులను సత్కరించి అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల మణికంఠ, ఈవో ఎంవీ రామయ్య పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనకు గుణపాఠం చెప్పాలి

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



అంబేద్కర్ విగ్రహానికి షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలకు గుణపాఠం చెప్పాలని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని 4వ వార్డులో భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి రక్షణగా నిర్మించిన షెల్టర్‌ను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ యువజన సంఘ కోరిక మేరకు 4వవార్డు ఇన్‌చార్జి బోళం రమణ, టీఎల్ఎఫ్ ప్రెసిడెంట్ బోళం రామలక్ష్మి దంపతులు ఇచ్చిన రూ.75వేలు విరాళంతో ఈ షెల్టర్‌ను నిర్మించారు. మంత్రి కొట్టు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతుంటే ప్రతిపక్ష పార్టీలు అరాచకం, అన్యాయం, అక్రమం, అశాంతి, అలజడులు సృష్టించడం కోసం ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ప్రతిపక్షాలకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. స్థానికులు శ్మశాన వాటికకు సంబంధించిన సమస్యను మంత్రి కొట్టు దృష్టికి తీసుకువచ్చారు. శ్మశాన వాటికకు సర్వే నిర్వహించి సరిహద్దులు నిర్ధారించి ఎవరికి ఎంత కేటాయించేది తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను మంత్రి కొట్టు ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, గుండుబోగుల నాగు, కర్రి భాస్కరరావు, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, కొలుకులూరి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమే లక్ష్యం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ఉణుదుర్రులో సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఉండి మండలం ఉణుదుర్రులో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి కారుమూరి మాట్లాడారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ సచివాలయాల ద్వారా గ్రామాలు బంగారంలా మారిపోయాయన్నారు. ప్రతీ పనికి మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం రాకపోవడంతో అన్ని పనులు సచివాలయంలోనే జరుగుతున్నాయన్నారు. ప్రతిపక్షాలు అక్రమంగా ఎన్ని కలిసినా జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని అన్నారు. ప్రజలంతా జగన్ మోహన్‌రెడ్డి పక్షంగా నిలబడిపోయారని దానికి సామాజిక బస్సు యాత్రలే ఉదాహరణ అని అన్నారు. ఏ ప్రాంతంలో బస్సు యాత్ర పెట్టినా వేలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావడం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ మహంకాళి, సర్పంచ్ పిన్నంరాజు నాగలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కూనపరాజు వర్మ, ఎంపీటీసీ అల్లూరి మాధవి, మండల లీగల్‌సెల్ అధ్యక్షుడు జి సుందర్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గూడెం జెడ్పీ హైస్కూల్‌లో క్రికెట్ చూస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తణుకు జెడ్పీ హైస్కూలు ప్రాంగణంలో స్క్రీన్‌పై మ్యాచ్ తిలకిస్తున్న ప్రజలు

క్రికెట్ ఫైనల్ ఫీవర్

- వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌పై ప్రత్యేక ఆసక్తి
- భారీ స్క్రీన్లు, ప్రొజెక్టర్లతో ప్రదర్శన



ఏలూరు ఇండోర్ స్టేడియంలో డ్రమ్ములు వాయిస్తూ సందడి చేస్తున్న అభిమానులు

భీమవరం: క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ తిలకించడానికి చూసేందుకు ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భారత్–ఆస్ట్రేలియా మధ్య అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్‌లో భారత్ విజయం సాధించాలని ఆదివారం ఉదయం అనేకమంది క్రీడాభిమానులు ఆలయాల్లో పూజలు, చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. యువతేగాకుండా మహిళలు, పెద్దలు సైతం క్రికెట్ మ్యాచ్ పట్ల ఆసక్తి చూపించడం విశేషం. మధ్యాహ్నం రెండు గంటలకు మ్యాచ్ ప్రారంభానికి ముందుగానే అనేక ప్రాంతాల్లో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు, మరికొన్ని చోట్ల ప్రొజెక్టర్లతో తెరలపై క్రికెట్ తిలకించేలా ఏర్పాట్లు చేశారు.

భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు, ప్రొజెక్టర్లు ఏర్పాట్లు

జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడు, తాడేపల్లిగూడెం, తణుకు, పెదలి, తోలేరు, చినమిల్లిపాడు వంటి ప్రాంతాల్లో ప్రత్యేకంగా షామియానాలు ఏర్పాటుచేసి భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లపై క్రికెట్ అభిమానులు మ్యాచ్‌ను తిలకించేలా చర్యలు తీసుకున్నారు. కొన్ని అపార్ట్‌మెంట్స్ వద్ద సెల్లార్స్‌లో పెద్ద పెద్ద టీవీలు ఏర్పాటుచేశారు. కార్తీకమాసం కావడంతో జిల్లాలో అనేకచోట్ల పెళ్లిళ్లు, గృహప్రవేశాల ముహూర్తాలు ఉండడంతో అక్కడ కూడా భారీ స్క్రీన్లపై క్రికెట్‌ను తిలకించేలా చర్యలు తీసుకున్నారు.

తణుకులో..

తణుకు అర్బన్ : తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో మంత్రి కారుమూరి ఏర్పాటుచేసిన భారీ స్క్రీన్‌పై వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ చూసేందుకు భారీ సంఖ్యలో యువత, క్రికెట్ అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మ్యాచ్ చూసేందుకు తరలివచ్చిన క్రికెట్ అభిమానులు, చిన్నారులకు మంత్రి కారుమూరి స్నాక్స్, డ్రింక్స్ అందచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, జల్లూరి జగదీష్, ఏఎంసీ డైరెక్టర్ పుల్లెల సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో క్రికెట్ జోష్

తాడేపల్లిగూడెం : ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ యువతతో కలిసి తిలకించారు. వైఎస్సార్‌సీపీ యువనేత కొట్టు విశాల్ ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీ హైస్కూలులో బిగ్ స్క్రీన్ ఏర్పాటుచేశారు. వెయ్యి మంది కూర్చుని మ్యాచ్‌ను వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అందరితో కలిసి మ్యాచ్ చూడటం ఆనందంగా ఉందన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



భీమడోలులో నిర్వహించిన దళితుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

భీమడోలు: బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన బాధ్యత పౌరులుగా మనందరిపై ఉందని ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. భీమడోలు ఆర్అండ్ బీ ప్రాంగణంలో ఆదివారం రాత్రి దళితుల ఆత్మీయ సమావేశం జరిగింది. తొలుత ఆయనకు దళితుల నాయకులు, యువకులు ఘన స్వాగతం పలికారు. అర్జావారిగూడెంలోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జై భీమ్ అంటూ నినదించారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, తహసీల్దార్ ఎం.ఇందిరా గాంధీతో కలిసి ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. అనంతరం ఆత్మీయ సమావేశానికి ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్‌కుమార్ అధ్యక్షత వహించారు. సమావేశంలో రాష్ట్రంలోని దళితుల సమస్యలు, రిజర్వేషన్లు, ప్రభుత్వం నుంచి దళితులకు వచ్చే రాయితీలు, దళిత ఉద్యోగుల పదోన్నతులు, విద్యార్థుల సమస్యలపై చర్చించారు. విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ దళితుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐ బీబీ రవికుమార్, నారాయణపురం డిగ్రీ కళాశాల అధ్యాపకుడు కొండా రవి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కొత్తపల్లి చంద్రమౌళి, జిల్లా నాయకులు కనికెళ్ల మురళీకృష్ణ, నిర్వాహకులు దొలూరి మరియన్న, గోగులమూడి రవికుమార్, ఎం.రత్నంరాజు, ఉండ్రు బెంజిమన్, కె.జాన్‌ప్రసాద్, చెక్కా పుల్లయ్య, నాయకులు గొల్లా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు బయల్దేరిన బస్సులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏలూరు జిల్లా వ్యాప్తంగా కార్తీక మాసం పురస్కరించుకొని పవిత్ర పుణ్యక్షేత్రాలైన పంచారామాలకు ఏలూరు డిపో నుంచి రెండు బస్సులను, జంగారెడ్డిగూడెం డిపో నుంచి ఒక బస్సుని ఆదివారం రాత్రి భక్తులతో పంపారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించే భక్తుల సౌకర్యార్థం ఈ ఏడాది నుంచి ఒక్కొక్కరికి వాటర్ బాటిల్, అల్పాహార పొట్లాలు అందించారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించే భక్తులకి ప్రతి దేవాలయంలో ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశామన్నారు. ఈసారి శబరిమలైకి ఆర్టీసీ బస్సులను అయ్యప్ప భక్తులు బాగా ఉపయోగించుకుంటున్నారని ఇప్పటికే బస్సులు బుక్కయ్యాయని ప్రతి ఒక్కరు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి దైవ దర్శనాలు చేసుకొని క్షేమంగా గమ్యం చేరుకోవాలని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎస్‌వీఆర్ వరప్రసాద్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బీ.వాణి, ఏఎంటీ బీ.మురళి పాల్గొన్నారు.

క్లుప్తంగా

108లో ప్రసవం



ప్రసవం తరువాత తల్లీబిడ్డతో సిబ్బంది

పెనుగొండ: 108 వాహనంలో ఓ గర్భిణికి కాన్పు చేసి సిబ్బంది మరోసారి నిబద్ధతను చాటారు. ఆచంట కొత్తూరు సెంటర్‌కు చెందిన నెక్కంటి రేఖ (22)కు పుదుడు పోశారు. ఆదివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించడంతో గర్భిణిని ఆచంట వేమవరం పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలోనే నొప్పులు తీవ్రమవడంతో సిబ్బంది అప్రమత్తమై పురుడు పోశారు. నాలుగు కేజీల బరువు ఉన్న మగశిశువు జన్మించాడు. తల్లీబిడ్డలను ఆచంట వేమవరం పీహెచ్‌సీలో చేర్చారు. టెక్నీషియన్ వి.క్రాంతి కిరణ్, పైలెట్ టీసీహెచ్ రాంబాబులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు క్రికెట్ అండర్-17 ఎంపిక పోటీలు

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-17 బాలికల క్రికెట్ ఎంపిక పోటీలు మంగళవారం నిర్వహిస్తున్నట్టు స్కూల్ గేమ్స్ సెక్రటరీలు రాజేంద్రప్రసాద్, మల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. పల్లంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఇతర వివరాలకు 98666 78844 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'సురక్ష'లో సిఫారసు.. ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 1,584 మందికి మెరుగైన వైద్యానికి సిఫారసు
- 356 మందికి పరీక్షలతో నయం
- 120 మందికి శస్త్రచికిత్సలు పూర్తి

భీమవరం(ప్రకాశం చౌక్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో వైద్యులు సిఫారసు చేసిన రోగులకు ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు చురుగ్గా జరుగుతున్నాయి. రోగులకు ఆరోగ్యశ్రీలో ఉచితంగా, వేగంగా ఆపరేషన్లు చేసేలా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కంటి ఆపరేషన్లు నుంచి క్యాన్సర్ కేసుల వరకు ఆపరేషన్లు జరుగుతున్నాయి. అయితే ఈ ఆపరేషన్లను శనివారం నుంచి వేగవంతం చేయాలని వైద్యా ఆరోగ్యశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

1,584 మందికి మెరుగైన వైద్యం

జిల్లా వ్యాప్తంగా జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో 1,584 మందికి మెరుగైన వైద్యం అవసరమని వైద్యులు గుర్తించి వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. వారిలో 356 మందికి పరీక్షలు పూర్తి చేసి ఆపరేషన్లు అవసరం లేకుండా వైద్య సేవలు అందించారు. మిగిలిన వారికి పరీక్షలు చేయాల్సి ఉంది. అలాగే 560 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించగా, వారిలో ఇప్పటివరకు 120 మందికి ఆపరేషన్లు పూర్తి చేశారు.

ఇప్పటివరకు జరిగిన ఆపరేషన్ల వివరాలు

కార్డియాలజీ 6, జనరల్ సర్జరీ 6, గైనకాలజీ 1, కంటి ఆపరేషన్లు 27, క్యాన్సర్ 1, ఆర్థోపెటిక్ 7, జెనిటో యూరినరీ 4, ఈఎన్‌టీ 5, న్యూరోలజీ 1, పీడియాట్రిక్ 2, జనరల్ మెడిసిన్ 62 కేసుల చొప్పున ఆపరేషన్లు చేశారు.



భీమవరంలో ఓ ఆస్పత్రిలో రోగికి ఆరోగ్యశ్రీలో కంటి ఆపరేషన్ చేసి డిశ్చార్జ్ చేస్తున్న దృశ్యం



కీమోథెరపీ చికిత్స అనంతరం డిశ్చార్జి అవుతున్న ఓ వ్యక్తి

జిల్లాలో ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల వివరాలు	
ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు	21
జిల్లా ఆస్పత్రి	1
ప్రభుత్వ ఏరియా ఆస్పత్రులు	4
డెంటల్ ఆస్పత్రులు	10

వైద్యం వేగంగా అందేలా చర్యలు



జిల్లాలో సెప్టెంబర్ 30 తేదీ నుంచి నవంబరు 15 తేదీ వరకు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో 1584 మందికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించాం. వారికి ఆరోగ్యశ్రీలో వేగంగా వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆపరేషన్లు అవసరమైన వారికి వెంటనే ఆపరేషన్లు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. జిల్లాలోని ఆరోగ్యశ్రీ సౌకర్యం కలిగిన ఆస్పత్రుల్లో ఆయా రోగులకు ఉచిత వైద్యం అందుతోంది. ఆరోగ్యశ్రీలో ఆపరేషన్లు చేయించుకున్నవారికి ఆసరా పథకం ద్వారా విశ్రాంతి తీసుకోవడానికి అవసరమైన ఆర్థిక సాయం అందిస్తాం.

– పి.ప్రశాంతి, కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా

దాడి ఘటనలో తండ్రీకొడుకులకు రిమాండ్

భీమడోలు: ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో తండ్రీకొడుకులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై దావా సురేష్‌కుమార్ ఆదివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కురెళ్లగూడెంకు చెందిన శనగల కిషోర్, అదే గ్రామానికి చెందిన సత్తియ్యలు కూలీలు. ఈనెల 15న సత్తియ్యకు అదే ఊరికి చెందిన కాటూరి ప్రసాద్ మధ్య మోటర్ సైకిల్ విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో కిషోర్ వారిద్దరికి సర్ది చెప్పే ప్రయత్నం చేశాడు. దీంతో అహం దెబ్బతిన్న ప్రసాద్ కిషోర్‌పై కక్ష పెంచుకుని ఇంటికి వెళ్లి తన కొడుకు జయవర్ధన్‌ని రెచ్చగొట్టాడు. దీంతో తండ్రీ కొడుకులు ఇనుపరాడ్‌తో కిషోర్‌పై దాడి చేశారు. తీవ్ర గాయాలైన కిషోర్‌ను అతని స్నేహితులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కిషోర్ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. తండ్రీ కొడుకులు ప్రసాద్, జయవర్ధన్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై దావా సురేష్‌కుమార్ తెలిపారు.

పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్: కడుపు నొప్పి తాళలేక ఓ వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం రూరల్ మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన తాడిపట్టి వీరమ్మ (40) కడుపు నొప్పి తాళలేక ఆదివారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా, దీంతో ఆమెను కుటుంబ సభ్యులు తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి గండికోట నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై రూరల్ ఏఎస్సై దుర్గారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వంగా సువర్చలా హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, పండితులు స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. స్వామివారి మూలవిరాట్‌కి ప్రాతఃకాలార్చన, నిత్యహోమ బలిహరణలు, తోమాల సేవ జరిపారు. రాజమండ్రికి చెందిన శ్రీ బాలరాజరాజేశ్వరీ కూచిపూడి నృత్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన, ఆచంటకు చెందిన శ్రీవేణుగోపాల కోలాట భజన మండలి ఆకట్టుకుంది. సోమవారం స్వామివారికి లక్ష తమలపాకులతో లక్షార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు.



సువర్చలా హనుమద్ కల్యాణం నిర్వహించిన దృశ్యం

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్: అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని తాడేపల్లిగూడెం రూరల్ పోలీసులు ఆదివారం గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని ఓ చెట్టుకు ఆదివారం ఒక గుర్తు తెలియని వ్యక్తి వేలాడుతూ ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 35 ఏళ్ల వయస్సు ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుని వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతదేహంపై రక్తపు మరకలు ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తోంది. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జనవరి 5 నుంచి తెలుగు మహాసభలు

కాళ్ల: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 5, 6, 7 తేదీలలో రాజమహేంద్రవరంలో రాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలలో భాగంగా రెండో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రమేవ జయతే అన్న నినాదంతో ఈ సభలు నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా తెలుగు భాషలో ఉన్న వివిధ ప్రక్రియలకు సంబంధించిన 26 సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు భాష కోసం విశేష కృషి చేసిన ఎందరో కవులు, పండితులు, కళాకారులు, సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. ఆదికవి నన్నయ మహాభారత రచనకు శ్రీకారం చుట్టి వెయ్యి సంవత్సరాలైన సందర్భంగా వెయ్యి మంది కవులతో ఆదికవి నన్నయకు నీరాజనం ఇచ్చే కార్యక్రమం చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. పదివేల మంది విద్యార్థులతో వేమన శతక పద్యాలు వల్లె వేసే కార్యక్రమంతో పాటు తెలుగు భాషా పరిరక్షణ కార్యక్రమాలపై ఒక ప్రత్యేక సదస్సు నిర్వహిస్తామన్నారు. వీటిలో పాల్గొనదలచినవారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇందుకోసం ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, ఈ సంస్థ ముఖ్య సంచాలకుడు కేశరాజు రాంప్రసాద్‌లతో ఉండి నియోజకవర్గ ఆంధ్ర సారస్వత పరిషత్ ఉత్సవ కమిటీని నియమించామన్నారు. దీనికి సంచాలకులుగా కోపల్లెకు చెందిన పెనుమత్స విశ్వనాథరాజు, సహ సంచాలకులుగా పెంకి విజయ్‌కుమార్, సభ్యులుగా కొత్తపల్లి మణి త్రినాథరాజు, ముదునూరి శివరామరాజు, కళ్లేపల్లి సతీష్‌రాజు, దాసరి సత్యనారాయణ అగ్నిహోత్రం ఫణిప్రసాద్, ఆకివీడు ఆదిత్య స్కూల్ సాంబశివరావు, డ్రాయింగ్ టీచర్ ఆచారి, కవి రంగరాజు, నటులు వెంకటేశ్వరరావు తెలుగు పండిట్ కే శ్రీనివాస్ అప్పన్న, చల్లా సాయిలతో కమిటీ ఏర్పాటు చేసినట్లు వివరించారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

క్షేత్రంలో గుండెపోటుతో కురుపాం ఎంపీడీవో మృతి



శివరామప్ప మృతదేహం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో గుండెపోటుకు గురై విజయనగరం జిల్లా బొబ్బిలి గ్రామానికి చెందిన, కురుపాం ఎంపీడీవో వంగూరి వెంకట శివరామప్ప (60) ఆదివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులతో కలసి క్షేత్రానికి విచ్చేసిన ఆయన మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయం నుంచి బయటకు వచ్చిన ఆయన తూర్పు రాజగోపుర ప్రాంతంలో గుండెపోటుతో కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయనను దేవస్థానం అంబులెన్స్‌లో స్థానిక ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రామప్పను పరీక్షించిన వైద్యుడు అప్పటికే ఆయన మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని అదే అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు.

కోడి పందేలపై దాడి.. వ్యక్తి అరెస్టు

భీమవరం అర్బన్: కోడి పందేలపై పోలీసులు దాడి చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దిరుసుమర్రులో కోడి పందేలపై దాడి చేసి, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని రూ.900 నగదు, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎస్సై బి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాట్నాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెదవేగి: రాట్నాలకుంటలోని శ్రీరాట్నాలమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజాటికెట్ల ద్వారా రూ.18,010, విరాళాలుగా రూ.13,200, ప్రసాదాల ద్వారా రూ.10,500, ఫొటోల అమ్మకంపై రూ.1,945 మొత్తం రూ.45,665 ఆదాయం లభించిందని దేవస్థాన ఈఓ ఎస్.సతీష్‌కుమార్ చెప్పారు.

క్లుప్తంగా

మనోధైర్యాన్ని పెంచుకోవాలి


చర్చలో మాట్లాడుతున్న విద్యార్థిని

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు అధ్వర్యాన ఆదివారం ఇందిరా గాంధీ జయంతి, జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సంగీతం శిక్షకురాలు కె.లక్ష్మీదేవి, లెక్చరర్ బాల త్రిపుర సుందరి హాజరై విద్యార్థినులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ మహిళలకు అవసరమైన చట్టాలను ప్రభుత్వాలు రూపొందించాలని, విద్యతో పాటు ఉపాధి, మనోధైర్యం పెంపొందించుకోవాలని సూచించారు. మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. తొలుత ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గరికిపాటి బాపయ్య శర్మ, ఎస్.సాల్మన్ రాజు, జాన్‌బాబు, కె.వెంకటేశ్వరరావు, మధు హాజరయ్యారు.

ముత్యాలమ్మ దేవస్థానానికి వెండి నక్షత్ర హారతి బహూకరణ


వెండి నక్షత్ర హారతిని బహుకరిస్తున్న దాతలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం శ్రీ ముత్యాలమ్మ వారి దేవస్థానానికి ఆదివారం తణుకు పట్టణానికి చెందిన బొల్లిన మాధవీలత 720 గ్రాముల వెండి నక్షత్ర హారతిని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాకా బాలాజీ, సభ్యులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


ఆంజనేయ స్వామివారు

పెంటపాడు: కె.పెంటపాడు బైరాగి మఠంలో ఆదివారం క్షేత్ర పాలకుడైన హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని స్వామివారిని తులసీదళాలతో అలంకరించారు. అభిషేకం, నాగవల్లీ సహిత సింధూరాలతో పూజించారు. అర్చకులు త్రిలోచన దాస్, పూర్ణచంద్ర త్రిపాఠిలు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదం పంపిణీ చేశారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళి


అరవల్లి గ్రంథాలయంలో ఇందిరా గాంధీకి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు, విద్యార్థులు

అత్తిలి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అత్తిలి గ్రంథాలయంలో ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. దిశా చట్టం, మహిళా సాధికారత అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ వైపీఎస్ లక్ష్మి, సెక్రటరీ ఎస్వీ శ్రీనివాస రెడ్డి, గ్రంథాలయాధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు దొమ్మేటి నాగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'

పెంటపాడు: 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని సోమవారం పరిమెళ్ల, మంగళవారం రాచర్ల, బుధవారం జట్లపాలెం, గురువారం మౌంజిపాడు గ్రామాల్లో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

భారీగా క్రికెట్ బెట్టింగ్‌లు ?

భీమవరం (ప్రకాశం చౌక్): ఇండియా - ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం నిర్వహించిన ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌పై జిల్లాలో భారీగా బెట్టింగులు జరిగినట్లు సమాచారం. గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణం వరకు క్రికెట్ పందేలు కోట్ల రూపాయల్లో జరిగినట్లు చెబుతున్నారు. కొందరు టోటల్ టీమ్ విన్నింగ్‌పై, మరికొందరు ఓవర్ టు ఓవర్, బాల్ టు బాల్ పందేలు కాసినట్లు తెలిసింది. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.50 కోట్ల నుంచి రూ.70 కోట్ల మేర పందేలు జరిగి ఉండవచ్చని అంటున్నారు. రూ.1000 నుంచి రూ.5 లక్షల వరకు టీమ్ ఇండియాపై భారీగా పందేలు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

సొసైటీల అభివృద్ధికి రైతులు సహకరించాలి


నవాబుపాలెం సొసైటీ వద్ద సహకార పతాకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది, రైతులు

తాడేపల్లిగూడెం రూరల్: సొసైటీల అభివృద్ధికి రైతులు సహాయ, సహకారాలు అందించాలని నవాబుపాలెం సొసైటీ చైర్మన్ జడ్డు హరిబాబు అన్నారు. జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని నవాబుపాలెం సొసైటీ వద్ద సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొసైటీల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి, అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు భాస్కర్, మద్దుకూరి మెహర్ ప్రసాద్, పర్సన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేటిపాడులో..

ఇరగవరం: మండలంలోని ఏలేటిపాడు గ్రామంలో ఆదివారం సొసైటీ అధ్వర్యాన జాతీయ సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సొసైటీ అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు సహకార జెండాను ఆవిష్కరించారు. సొసైటీ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, రుణాలను వివరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించగా, డిప్యూటీ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ సహకార అధికారి పి.వెంకటేశ్వరరావు, సొసైటీ సీఈవో ఎస్.సుధాకర్ రెడ్డి, డైరెక్టర్లు చోడే ఏసురత్నం, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రెడ్డి జన సంఘం ఆధ్వర్యాన కార్తీక వన సమారాధన


మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న రెడ్డి జన సంఘ నాయకులు

తణుకు టౌన్: తణుకు రెడ్డి జన సంఘం, జిల్లా రెడ్డి సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యాన కార్తీక వన సమారాధన నిర్వహించారు. తణుకు పైడిపర్రులోని రెడ్డి జన సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రిమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాజమండ్రి రుడా చైర్‌పర్సన్, అనంత నియోజకవర్గ కన్వీనర్ మేడపాటి షర్మిలా రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జిల్లా రెడ్డి సంఘ అధ్యక్షుడు వేణుగోపాల రెడ్డి, నాయకులు లక్ష్మణరెడ్డి, కర్రి రామచంద్రారెడ్డి, తమనంపూడి వెంకటరెడ్డి, ఎస్వీ రెడ్డి, సురేష్ రెడ్డి పర్యవేక్షించగా, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన రెడ్డి సంఘ నాయకులు, రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం


పరీక్షలు చేస్తున్న వైద్యుడు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్థానిక కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో దాత, లయన్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ పదమ్ కుమార్ గుప్తా సహకారంతో రాజమండ్రికి చెందిన రాజేశ్వరీ రామకృష్ణన్ నేత్ర వైద్యశాల నేత్ర వైద్య శిబిరం నిర్వహించింది. లయన్ పచ్చిగోళ్ళ శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించగా, శిబిరంలో 112 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. 19 మందిని ఉచిత ఆపరేషన్ల నిమిత్తం నిడదవోలు ఆసుపత్రికి పంపారు. 29 మందికి ఉచితంగా కళ్ళజోళ్లు పంపిణీ చేసేందుకు నిర్ణయించారు. ఆర్ఎంపీల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వరరావు, క్లబ్ అధ్యక్షులు రామ్మోహన్‌రావు, రీజియన్ చైర్మన్ మదన్మోహన్ అగర్వాల్, రీజినల్ సెక్రటరీ సన్నిధి సూర్యనారాయణ మూర్తి, పచ్చ వెంకటేశ్వరరావు, పడాల మహేశ్వరరావు, ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే దిశా యాప్


భీమవరంలో మహిళలను సత్కరించిన దృశ్యం

భీమవరం: మహిళల రక్షణ కోసం రూపొందించిన దిశా యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని దిశా మహిళా పోలీస్ షేహనాజ్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవ వేడుకలను అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన వైఎస్సార్ శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురు మహిళలను సత్కరించారు. షేహనాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ ఫోన్‌లో దిశా యాప్ ఉండాలని, ఈ యాప్‌లపై అన్ని కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిటీ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహిళా సాధికారతతోనే దేశ ప్రగతి అని అన్నారు. అనంతరం షేహనాజ్, కె.పద్మదేవి, వి.లక్ష్మీభవాని, ఎస్.లక్ష్మి, భవాని శీతల్, పుష్పలను సత్కరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్.వెంకటేశ్వరరావు, కలిగొట్ల గోపాల శర్మ, చెరుకువాడ వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు


నంది అవార్డులు అందుకున్న భీమవరం వాసులు

భీమవరం ప్రకాశం చౌక్: సేవలకు గుర్తింపుగా భీమవరానికి చెందిన పలువురిని నంది అవార్డులు వరించాయి. విజయవాడలో రితిక ఫౌండేషన్ నంది అవార్డులను ప్రదానం చేసింది. భీమవరానికి చెందిన బ్రహ్మశ్రీ కుందుర్తి నరసింహశర్మ, స్మార్త ప్రవీణ బ్రహ్మశ్రీ వేలూరి కృష్ణ శర్మ, మీ కోసం సేవా సంస్థ అధ్యక్షుడు, బాలా త్రిపుర సుందరి ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ కొమ్ము శ్రీనివాస్‌లు నంది అవార్డులను అందుకున్నారు. అవార్డు గ్రహీతలకు పురాణం భాస్కరబాబు, అనుముల రాంబాబు, కోళ్ళట్ల మణికంఠ శర్మ, విజయవాడ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వార్షికోత్సవం

వీరవాసరం: వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో మహాకరుణ శాకాహార ర్యాలీని ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామ స్వామివారి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన వార్షికోత్సవ వేడుకలను సర్పంచ్ చికిలే మంగతాయారు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతత కోసం శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేయాలని అన్నారు. రాయకుదురు చిన్నారుల కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ అధ్యక్షుడు రుద్రరాజు పెద్దిరాజు, వీరవాసరం సబ్ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్, కరుటూరి రంగారావు, మేకా వెంకటేశ్వరరావు, భూపతిరాజు శ్రీనివాసరాజు, కేవీడీ ప్రసాద్, కె.మోహన్ కుమార్, మేడిశెట్టి కృష్ణారావు వర్రె విశ్వేశ్వరరావు, టి.నాగరాజు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పిరమిడ్ ధ్యానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

22 నుంచి పాండురంగ స్వామి కల్యాణోత్సవాలు

కాళ్ల: కాళ్లలో కొలువై ఉన్న శ్రీ రుక్మిణీ సమేత పాండురంగస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆలయ శాశ్వత ధర్మకర్త శ్రీమందలపర్తి చంద్రశేఖర్, బాల దంపతుల ఆధ్వర్యంలో జరిగే ఈ కల్యాణ మహోత్సవాలు ఈనెల 22న వినాయక పూజతో ప్రారంభించి స్వామి అమ్మవార్లను పెండ్లి కుమారుడు, కుమార్తెలుగా చేస్తామన్నారు. 23న సాయంత్రం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహిస్తామన్నారు. 28న ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

నరసాపురం పీఏసీఎస్‌లో సహకార వారోత్సవాలు

నరసాపురం: సహకార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పీఏసీఎస్‌లో కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్ పతాకావిష్కరణ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సహకారసంఘాల అభివృద్ధికి అనేక చర్యలు చేపడుతుందన్నారు. రైతుల సంక్షేమ కోసం సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలు వివరించారు. సహకార శాఖ డివిజన్ అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ డివిజన్‌లో సహకారశాఖ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ అధికారులు, ఉద్యోగులు కె.జోసెఫ్‌పాల్, పి.ఆనంద్‌రాజు, ఎం.శ్రీనివాన బాబు పాల్గొన్నారు.

సంచార వైద్యశాల ద్వారా ఉచిత సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన సంచార వైద్యశాల ద్వారా ఆదివారం 10 మంది వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి సేవలందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు పట్టణం, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి వైద్యసేవలు అందించినట్లు చెప్పారు. అసోసియేషన్ సభ్యుడు దాట్ల రామరాజు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కరరావు, గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రతి నెలా మూడో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 45 మందికి ఉచిత షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించినట్లు సంఘ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. శిబిరంలో సాయిశ్వేత డయాగ్నస్టిక్స్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

21న రౌండ్ టేబుల్ సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): భీమవరంలో ఈనెల 21వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ మాదిగ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ అధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని, దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

10న బ్రాహ్మణ కార్తీక వన సమారాధన

తాడేపల్లిగూడెం (టీఓసీ): బ్రాహ్మణ సేవా పరిషత్ అధ్వర్యాన డిసెంబర్ 10వ తేదీన ఆదివారం పెద తాడేపల్లి గాయత్రి కళ్యాణ మండపంలో కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షుడు పుల్లాభొట్ల సూర్యనారాయణ మూర్తి తెలిపారు. పట్టణ, పరిసర గ్రామాల్లో బ్రాహ్మణులు కుటుంబ సభ్యులతో హాజరై విజయవంతం చేయాలని కార్యదర్శి బుద్ధవరపు సత్య వెంకట సుబ్బారావు, కోశాధికారి ప్రవా శ్రీనివాస్, గరికపాటి బాపయ్య శర్మ, అత్తిలి నాగ భాస్కర్ శ్రీనివాస్, కలిగొట్ల శ్రీనివాస్ తదితరులు కోరారు.

నేడు భీమవరంలో కుల గణనపై సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర ప్రభుత్వం తరఫున సోమవారం భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కుల గణనపై సమావేశం నిర్వహిస్తున్నారని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు వెల్లడించారు. వివిధ కులాలకు చెందిన సభ్యులు పాల్గొంటారని వివరించారు.

2న బైరాగి మఠం చేపల చెరువు వేలం

పెంటపాడు: కె.పెంటపాడు బైరాగి మఠంలోని గోపాలస్వామి ఆలయానికి సంబంధించి చేపల చెరువు లీజుకు గానూ వేలం పాట డిసెంబర్ 2న నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి కె.రవిశంకర్ తెలిపారు. కె.పెంటపాడులోని గ్రామ సర్వే నెంబర్ 247లో ఉన్న 3.34 ఎకరాల చేపల చెరువు లీజుకు గానూ వేలం పాట దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు. 23 డిసెంబర్ 2023 నుంచి 19 డిసెంబర్ 2026 వరకు లీజు హక్కుకు గానూ ఈ వేలం పాట డిసెంబర్ 2న ఉదయం 10 గంటలకు బైరాగి మఠంలో జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు రూ.25 వేలు ధరావత్తు సొమ్ము చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు.

నేడు కోలమూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

ఉండి: మండలంలోని కోలమూరు గ్రామంలో సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పీవీఎల్ఎన్ అంజనేయరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామ సచివాలయం వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల పార్టీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పక పాల్గొనాలని ఆయన కోరారు.

సోమేశ్వర ఆలయానికి రూ.1.40 లక్షల ఆదాయం

భీమవరం ప్రకాశం చౌక్: భీమవరం గునుపూడిలో వేంచేసి యున్న పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్దన స్వామివార్ల దేవస్థానం నందు కార్తీక మాసోత్సవాల్లో భాగంగా 6 రోజులకు రూ.1.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో బి.రామకృష్ణంరాజు తెలిపారు. భక్తులు దర్శన టికెట్ల ద్వారా రూ.1,21,550లు, పూజా రుసుముల ద్వారా రూ.800లు, లడ్డు ప్రసాదం విక్రయం ద్వారా రూ.17,310లు, విరాళాల ద్వారా రూ.1,050లు మొత్తం రూ.1,40,995లు ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

దిశా చట్టంపై వక్తృత్వ పోటీలు

పాలకోడేరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గొల్లలకోడేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం బాలికలకు దిశా చట్టంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అలాగే దిశ చట్టంపై, గ్రంథాలయాలు-వాటి ఉపయోగాలు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జి.బాలరాజు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 20వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. మహిళా పోలీస్ బి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

పంచారామ దర్శనికి తరలి వెళ్లిన ఆర్టీసీ బస్సు


బయల్దేరిన ఆర్టీసీ బస్సు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పంచారామ దర్శినిలో భాగంగా పవిత్ర కార్తీక మాసంలో అమరావతి, సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరంలో కొలువైన పరమేశ్వరుడిని దర్శనం చేసుకునే ఒక రోజు ఆధ్యాత్మిక యాత్ర బస్సు ఆదివారం రాత్రి తరలి వెళ్ళింది. యాత్రను డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తిరిగి ఈనెల 26 తేదీ, డిసెంబర్ నెలలో 3, 10 తేదీల్లో ఆదివారం రోజులలో రాత్రి 9 గంటలకు బస్ స్టేషన్ నుంచి పంచారామ దర్శిని కోసం ఆర్టీసీ బస్సులు బయలుదేరుతాయని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

25న అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

ఆర్టీసీ ఆధ్వర్యాన తాడేపల్లిగూడెం బస్సు స్టేషన్ నుంచి ఈనెల 25వ తేదీ శనివారం రాత్రి 7 గంటలకు అరుణాచలంకు గిరి ప్రదక్షిణ కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సు బయలుదేరుతున్నట్లు డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. 26వ తేదీ ఆదివారం ఉదయం శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, 27వ తేదీ సోమవారం పౌర్ణమి రోజున అరుణాచలం గిరి ప్రదక్షిణ చేసుకుని 28వ తేదీ మంగళవారం ఉదయం పట్టణానికి చేరుతుందని తెలిపారు. యాత్రను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయ్యప్ప ఆలయంలో కార్తీక మాసం పూజలు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు జాతీయ రహదారి సమీపంలోని శ్రీశాస్త పంచాయతన అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు చలపతి స్వామి, భరణి స్వామి అధ్వర్యాన ఉదయం గణపతి పూజ, పంచామృతాభిషేకాలు, మూల మంత్ర హోమం, ఉసిరి చెట్టు వద్ద పూజాదికాలు నిర్వహించారు. నల్లజర్ల వాస్తవ్యులు, మాజీ సర్పంచ్ రాయుడు ధర్మారావు, పుష్పావతి దంపతుల పేరిట కుటుంబ సభ్యులు గత కొన్నేళ్ల క్రితం అందించిన శాశ్వత విరాళంతో పాటు మాలధారుల సహకారంతో ప్రతి ఏడాది కార్తీక మాసం మొదటి ఆదివారం కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు గురుస్వామి చలపతి స్వామి తెలిపారు. పలువురు మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో కార్తీక వన సమారాధనకు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ముందుగా రాయుడు విజయ్‌కుమార్ ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. నిత్య పూజారి సత్యనారాయణ పాల్గొన్నారు.

రజక ఆత్మగౌరవ మహాసభకు తరలి రావాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గుంటూరు జిల్లా మంగళగిరి నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఈ నెల 28వ తేదీన రజక ఐక్య వేదిక తరఫున పాతపాటి అంజిబాబు అధ్వర్యాన రజక ఆత్మ గౌరవ సభ జరుగుతుందని రజక సంఘ నాయకులు తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం రావిపాడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆత్మగౌరవ సభకు తరలి రావాలని కోరుతూ పోస్టర్లు, స్టిక్కర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక వృత్తిదారుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అడ్డాల నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీను, యండమూరి సత్యనారాయణ, గోవర్ధనరావు, వై.శివ, లక్ష్మి, కనకదుర్గ, అప్పారావు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యానికి ప్రతీక కార్తీక వన సమారాధనలు


కాటన్ పార్కులో సహపంక్తి భోజనలు చేస్తున్న దృశ్యం

ఆకివీడు: కార్తీక వన సమారాధనలు ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. ఉప్పుటేరు వంతెన వద్ద ఉన్న కాటన్ పార్కులో ఆదివారం పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యాన కార్తీక వన సమారాధన జరిగింది. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాలబాలికలు పార్కులోని వివిధ క్రీడా పరికరాలతో ఆటలాడుకున్నారు. సంఘ అధ్యక్షుడు సప్పా మణికంఠ మాట్లాడుతూ ప్రతి ఏటా తమ సంఘం ద్వారా కార్తీక మాస విశిష్టతను తెలియజేస్తూ సామూహిక సహపంక్తి భోజనాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కుటుంబ సమేతంగా పద్మశాలి కులస్తులతో పాటు స్థానిక నాయకులు, పెద్దలు కార్యక్రమంలో పాల్గొని తమను ఆనందింపజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మంతెన రామరాజు, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్‌బీబీ, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలంటూ దళితుల నిరసన

పాలకోడేరు: గరగపర్రులో సాంఘిక బహిష్కరణకు గురైన దళితులకు ప్రభుత్వం ఇచ్చిన ఐదు హామీలను అమలుచేయాలని కోరుతూ ఆదివారం నినాదాలు చేశారు. గరగపర్రులో గరగపర్రు బాధితుల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డొల్ల పేతురు, కర్తాక యేసు, డొల్ల యోనాలు మాట్లాడుతూ 2017 తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో గరగపర్రు దళితులు సాంఘిక బహిష్కరణకు గురైతే, అప్పుడు కేవలం 282 మందికి మాత్రమే కుటుంబానికి ఒక్కరికి రూ.లక్ష రూపాయలు చొప్పున నాటి రాష్ట్ర ప్రభుత్వం అందించిందన్నారు. దళిత నేత డాక్టర్ గోళ్ళమూడి రాజసుందర్ బాబు కృషి మేరకు 500 మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున సాధించడం జరిగిందన్నారు. డాక్టర్ గోళ్ళమూడి రాజా సుందర్ బాబు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సూచనల మేరకే ఐదు డిమాండ్లపై అప్పటి కలెక్టర్, ఎస్పీ, మంత్రి రంగనాథరాజు సంతకాలు చేశారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు మాత్రమే పూర్తయిందని, దళితులకు ఇంకా పరిహారం పూర్తిస్థాయిలో అందలేదని, మూడెకరాల భూమి కేటాయింపు జరగలేదని వివరించారు. వెంటనే చట్ట ప్రకారం దళితులకు ఇచ్చిన హామీలను అమలు పరచాలని కోరారు. గరగపర్రు ఉద్యమ నాయకులుగా చెప్పుకుంటున్నవారితో జాగ్రత్త వహించాలన్నారు. అద్దంకి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి


మాట్లాడుతున్న సుందర రామరాజు

భీమవరం: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశం ఆదివారం భీమవరంలోని పార్టీ ఆఫీసులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర రామరాజు హాజరై మాట్లాడారు. మోడీ ప్రభుత్వం రైతాంగం, కార్మికులకు వ్యతిరేకంగా అనేక నిర్ణయాలు చేసిందని విమర్శించారు. అన్ని రకాల నిత్యావసర ధరలు పెరిగాయని, సామాన్యుడు బతకడం భారంగా మారిందని, పార్టీ శ్రేణులు ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. భీమవరం డివిజన్ కార్యదర్శిగా దండు శ్రీనివాస రాజు, తాడేపల్లిగూడెం డివిజన్ కార్యదర్శిగా బీహెచ్ఎన్‌వీ రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లంక కృష్ణ మూర్తి, కనుమూరి వెంకటపతి రాజు, కొత్తపల్లి సుబ్బరాజు, నడింపల్లి అరుణావరాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.